క్లుప్తంగా

అడ్డదారుల మూసివేత



కాయిదంపల్లి గ్రామ శివారులో అడ్డదారిపై గుంత తీసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

అల్లాదుర్గం(మెదక్): 'అడ్డ దారులతో ప్రమాదాలు' అనే శీర్షికతో జూన్ 20న సాక్షిలో కథనం ప్రచురితమైన వార్తకు నేషనల్ హైవే అధికారులు స్పందించారు. అడ్డదారులను మూసి వేశారు. పెద్దశంకరంపేట నుంచి అల్లాదుర్గం, సంగారెడ్డి జిల్లా నెరడిగుంట వరకు 161 జాతీయ రహదారి మధ్యలో పూల మొక్కల మధ్య నుంచి అడ్డదారులు చేసుకుని రాంగ్‌రూట్‌లో వాహనదారులు ప్రయాణం చేస్తున్నారు. దీంతో ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. సాక్షి కథనంతో పెద్దశంకరంపేట , అల్లాదుర్గం మధ్యలో అడ్డదారులపై ప్రయాణం చేయకుండా, రోడ్డు మధ్యలో పెద్ద గుంతలు చేయడంతో అడ్డదారులు మూతపడ్డయి. నేరడిగుంట ప్రాంతంలో అడ్డదారులు మూయక పోవడంతో అదే దారిలోవాహనాలను నడుపుతున్నారు.

ఎర్రకుంట అలుగు ఆక్రమణ



ఎర్రకుంట వద్ద మట్టిపోసి కబ్జా చేసిన భూ ఆక్రమణదారులు

హవేళిఘణాపూర్(మెదక్): చెరువు, కుంటల శిఖం భూములు కబ్జా చేసిన ఆక్రమణదారులు కనీసం అలుగు కింద ఉన్న భూములను కూడా వదలడం లేదు. మెదక్ మండల పరిధిలోని తిమ్మానగర్ గ్రామ శివారులో ఉన్న ఎర్రకుంట కింద అలుగు వద్ద మట్టి పోసి కబ్జా చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధిక వర్షాలు కురిస్తే అలుగుపారి పొంగిపొర్లేందుకు అవకాశం ఉంటుంది. కానీ మట్టిపోసి భూమిని ఆక్రమించడం అలుగు నుంచి నీరు పోకుండా అడ్డుగా మట్టి పోయడం ద్వారా నీరు నిండి కట్ట కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి కబ్జాకు గురైన భూమిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానపు రోడ్డుతో అగచాట్లు



గుంతలమయంగా ఉన్న శివ్వాయిపల్లి-మెదక్ రోడ్డు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని శివ్వాయిపల్లి గ్రామం నుంచి మెదక్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళల్లో గుంతలు ఏర్పడక అందులోపడి గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు. ఈ రోడ్డుకు మరమ్మతు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి



ర్యాలీలో ఆవుల రాజిరెడ్డి, నాయకులు

నర్సాపూర్: పేదల ప్రజల సంక్షేమానికి నిరంతరం పాటుపడుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ సభకు వెళ్తున్న వాహనాల కాన్వాయ్‌ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలనలో పేదలు సంతోషంగా ఉన్నారని, ఆరు గ్యారంటీలు అర్హులకు అందుతున్నాయని చెప్పారు. కాగా నియోజకవర్గంలోని పలు మండలాల పార్టీ అధ్యక్షులు, గ్రామ కమిటీ అధ్యక్షులతో కలిసి హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్లారు.

బీఎల్‌ఓలకు సూచనలు

రామాయంపేట(మెదక్): వివేకానంద విద్యాలయంలో శుక్రవారం జరిగిన బీఎల్‌ఓల శిక్షణకు మెదక్ ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ రజనికుమారి హాజరై మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ విషయమై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆర్డీఓ పాఠశాల కలియ తిరిగి విద్యార్థులతో మాట్లాడారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

అల్లాదుర్గం(మెదక్): ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు అర్జించవచ్చని లీవ్ పామ్ కంపెనీ అడ్వైజర్ డాక్టర్ వైఎస్ రంగానాయకులు చెప్పారు. శుక్రవారం అల్లాదుర్గంలో ఆయిల్ పామ్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్లు కష్టపడితే 20 రోజులకు ఒకసారి రైతులకు ఆదాయం వస్తుందన్నారు. ఆయిల్‌పామ్ సాగులో రైతులు అంతర్ పంటలను సైతం సాగు చేసి లబ్ధిపొందుతారని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 1500 ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో తొందరలోనే ఒకే రోజులు 500 ఎకరాలలో ఆయిల్‌పామ్ పెట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రైతులు అయిల్ పామ్ సాగు చేస్తే దేశంలో ఫామాయిల్ కొరత ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాజేశ్, ఏఈఓ నవీన్, లీవ్‌పామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రంగనాయకులు

ఆరెగూడెంలో...

వెల్దుర్తి(తూప్రాన్): ఆయిల్ పామ్ పంట సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని లివ్‌పామ్ కంపెనీ మేనేజర్ కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరెగూడెం గ్రామశివారులో రైతు గోవిందరెడ్డి సాగుచేస్తున్న ఆయిల్ పామ్ పంటను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులు వరి, మొక్కజొన్న, పత్తి పంటల్లో స్వల్పకాలికంగా ఆదాయాన్ని పొందుతున్నప్పటికీ దీర్ఘకాలికంగా రైతు ఆదాయం పెరగాలంటే తప్పనిసరిగా ఆయిల్ పామ్ సాగుతోనే సాధ్యమని తెలిపారు. ప్రభుత్వం డ్రిప్, మొక్కలకు అధిక మొత్తంలో రాయితీలను ఇస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మజీద్, వందన, లీవ్ పామ్ కంపెనీ డిప్యూటీ మేనేజర్ అశోక్, నిశాంత్‌లు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ పంటను సందర్శించిన అధికారులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ స్రవంతి

కొండాపూర్‌లో...

మనోహరాబాద్(తూప్రాన్): సాధారణ పంటల సాగుకంటే ఆయిల్‌పాం సాగు లాభదాయకంగా ఉంటుందని ఏఓ స్రవంతి అన్నారు. మండలంలోని కొండాపూర్‌లో శుక్రవారం ఓ రైతు మొక్కజొన్న పంటను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద ఆయిల్‌పాంపై రైతులకు అవగాహన కల్పించారు.

రంగువానిపల్లి పాఠశాల మూత

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులులేక మూతబడిన పాఠశాలను తెరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుండగా చిన్నశంకరంపేట మండలంలో మాత్రం తాజాగా మరోబడి మూతబడింది. మండలంలోని ఎస్.కొండపూర్ మధిర గ్రామమైన రంగువానిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు రావడం లేదని పాఠశాలను మూసివేశారు. గత సంవత్సరం ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఏడు కాగా, ఈసారి నాలుగుకు పడి పోయింది. ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు సరిగా బోధన చేయడంలేదని, పాఠశాలకు కూడా సరిగా రావడంలేదని భావించిన తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలకు పంపడం మానేశారు. ఈ నలుగురు కూడా ప్రైవేట్ పాఠశాలకు వెళుతుండటంతో చేసేదిలేక ప్రభుత్వ పాఠశాలను మూసివేశారు. ఉన్న ఒక్క ఉపాధ్యాయుడిని మిర్జాపల్లి ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్ వేశారు. ఈ విషయంపై ఎంఈఓ పుష్పవేణిని వివరణ కోరగా.. విద్యార్థులు రాకపోవడంతో పాఠశాలను మూసివేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పాఠశాల మూసివేతపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు తెలిపారు. కాగా ఇప్పటికే చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, టీ.మాందాపూర్ రాంజీతండా ప్రాథమిక పాఠశాలలు మూసివేశారు.



రంగువానిపల్లిలో మూతబడిన ప్రాథమిక పాఠశాల

ఆలయ భూముల్లో చెత్త

నర్సాపూర్: దేవాలయ భూముల్లో చెత్త పారవేస్తున్నారు. పట్టణ శివారులో జాతీయ రహదారిని ఆనుకుని మెదక్ మార్గంలో శ్రీలక్ష్మినారాయణ స్వామి ఆలయానికి సుమారు వంద ఎకరాల బీడు భూములు ఉన్నాయి. రోడ్డును ఆనుకుని ఉండడంతో పలు రకాల పాడైన తినుబండారాలు, పండ్ల తొక్కలు, కుళ్లిన పండ్లు, తదితర చెత్తను తెచ్చి పారవేయడంతో అవన్నీ కుళ్లిన తర్వాత దుర్వాసన వస్తుంది. మున్సిపాలిటీ సిబ్బంది దుకాణాల నుంచి చెత్త సేకరించేందుకు వస్తున్నప్పటికీ వారికి చెత్తను ఇవ్వలేని వ్యాపారులు తమ దుకాణాలు, హోటళ్లు, ఇతర తినుబండారాల వ్యాపారసంస్థల నుంచి వచ్చే చెత్తను ఆలయ భూములలో పారవేస్తున్నారనే అనుమానాలు వస్తున్నాయి. కాగా ప్లాస్టిక్ కవర్లను రోడ్డు పక్కన పారవేయడంతో గాలికి కవర్లు కొట్టుకు వచ్చి ద్విచక్ర వాహనదారులపై పడటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆలయ భూములలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాంచరణ్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా తమ సిబ్బంది ఆలయ భూముల్లో చెత్త వేయడం లేదని, చెత్తను డంప్‌యార్డుకు తరలిస్తున్నారని చెప్పారు.



నర్సాపూర్ మెదక్ జాతీయ రహదారి పక్కన గల ఆలయ భూముల్లో చెత్త కుప్పలు

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి

సంగారెడ్డి టౌన్ : ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులందరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఝాన్సీ స్పష్టం చేశారు. సంగారెడ్డి మండలంలోని కొత్లాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడం ద్వారా రైతులందరికీ ప్రభుత్వ పథకాలు, రాయితీలను పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని పూర్తి వివరాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫార్మర్ రిజిస్ట్రీ

నారాయణఖేడ్: ఆధార్‌తో ప్రతీ రైతుకు గుర్తింపు ఇచ్చి యూనిక్ కోడ్‌ను కేటాయించడం, రైతులకు గుర్తింపు కార్డు జారీ ప్రక్రియ నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా నాగల్‌గిద్ద మండలంలోని ఏస్గి, దామర్‌గిద్ద, గోందెగదాం గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను శుక్రవారం నిర్వహించారు. ఏఈవోలు సావిత్రి, సంతోష్, మహిపాల్ రైతుల వివరాలు నమోదు చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వ్యవసాయ అధికారి ప్రవీణ్‌చారి పర్యవేక్షించారు.



సంగారెడ్డి టౌన్ : రైతు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారులు

ప్రతీ రైతుకు యూనీకోడ్ తప్పనిసరి

కంగ్టి(నారాయణఖేడ్): ఆధార్ గుర్తింపు కార్డు తరహాలోనే ప్రతీ రైతుకు ఫార్మర్ యూనీకోడ్ తప్పనిసరని కంగ్టి మండల వ్యవసాయాధికారి హరీశ్ పవార్ తెలిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని రామోజీపల్లి గ్రామ శివారులో అన్యాక్రాంతానికి గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 34, 40, 42లో జేసీబీ సహాయంతో కొందరు లెవలింగ్ చేసి విక్రయిస్తున్నారని, ఈ విషయంపై అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని విన్నవించారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి

ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): నీటితొట్లు, వినియోగించని డబ్బాలు ఇతర వాటిలో ఎక్కువ రోజులు నీరు నిల్వ లేకుండా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్లా తెలిపారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా కౌడిపల్లిలో ఎంపీడీఓ, కూకుట్లపల్లిలో ఎంపీఓ డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ రోజులు నీరు నిలువ ఉన్నట్లయితే దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. దీంతో విష జ్వరాలు ప్రబలుతాయని పేర్కొన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశం, ప్రభాకర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నారుమళ్ల పరిశీలన

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంలో రైతులు వేసిన నారుమళ్లను మండల వ్యవసాయాధికారి రాజేశ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎకరానికి దొడ్డురకం 25 కిలోల విత్తనాలు, సన్న రకం 20 కిలోల విత్తనాలు వాడాలన్నారు. రైతులు సేంద్రియ ఎరువులను వాడితే దిగుబడి పెరుగుతుందని తెలిపారు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఏమైనా ఇబ్బందులు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయురాలు పద్మజ తెలిపారు. శుక్రవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో విద్యాబోధనతో పాటు ఇంటి వద్ద సైతం విద్యార్థులను చదివించాలని చెప్పారు. ప్రతిరోజు హోంవర్క్ చేయడంతోపాటు ఇంటి వద్ద పిల్లలు చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాదవ్, నరెందర్, లక్ష్మన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

మండల ప్రత్యేక అధికారి హైమావతి

చేగుంట(తూప్రాన్): ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి హైమావతి అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి కాలనీలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి సందర్శించి ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రం అందించారు. అనంతరం నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులు నిర్ణయించిన గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తే బిల్లులు సకాలంలో అందుతాయని తెలిపారు. అనంతరం కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, శ్రీశైలం, ఏఎస్ఎం అనురాధ, కాంగ్రెస్ నాయకులు నాయకులు శ్రీకాంత్, బలరాం తదితరులు ఉన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

పైపులైను వేశారు.. అడ్డగోలుగా పూడ్చారు

నర్సాపూర్: పైపులైను వేసేందుకు రోడ్డు పక్కన తవ్విన గుంతలను సక్రమంగా పూడ్చలేదు. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లేనందున పైపుల కోసం తవ్విన కాల్వను సరిగా పూడ్చలేదని విమర్శలు వస్తున్నాయి. అమృత్ జల్-2 పథకం కింద నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నీటి ట్యాంకు నిర్మాణం పనులను ఓ సంస్థ చేపట్టింది. పథకం పనులలో భాగంగా నీటి సరఫరా కోసం నర్సాపూర్ మెదక్ జాతీయ రహదారి పక్క నుంచి ఇటీవల కాలువ తవ్వి పైపులు వేసి కాల్వను మట్టితో పూడ్చినప్పటికి అక్కడక్కడా సరిగా పూడ్చనందున గుంతలు ఏర్పడ్డాయి. కాలువలో మట్టిని సరిగా నింపనందున కాలువ మధ్యలో పలు చోట్ల గుంతలు ఏర్పడి వర్షం కురువడంతో నీరు నిలుస్తుంది. కాగా కాలువ తవ్వగా వచ్చిన మట్టి మొత్తాన్ని కాలువ పూడ్చేందుకు వాడకుండా కొంత మట్టిని సైడ్ బర్మ్‌పై వదిలేశారు. కాగా వర్షం కురవడంతో రోడ్డు పక్కన వదిలేసిన మట్టి బురదగా మారడంతో వాహనదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. పైపులైను కోసం తవ్విన కాలువను సక్రమంగా పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పైపులైన్ కోసం తవ్వి సరిగా పూడ్చకపోవడంతో సైడ్ బర్మ్‌పై ఉన్న మట్టి

అడుగుకో గుంత.. తప్పదు చింత

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట మీదుగా పైతర, తుక్కాపూర్, టేక్మాల్ మండలం, పాపన్నపేట మండలంలోని గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రంగంపేటలోని చర్చికి సమీపంలో రెండు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వీటిలో వర్షపు నీరు చేరి గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు అందులో పడుతున్నారు. మరోవైపు గ్రామం నుంచి పై రెండు మండలాలకు అనుసంధానంగా ఉన్న రహదారి విద్యుత్ సబ్ స్టేషన్ మధ్యలో తారు వేయకుండా వదిలివేయడంతో అక్కడ సైతం గుంతలు ఏర్పడి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కనీసం గుంతల్లో నీటిని పక్కకు తప్పించి మట్టి పోసి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలో నీరు చేరిన దృశ్యం

అటవీ, రెవెన్యూ భూములపై సమీక్ష

అధికారులకు ఆర్డీఓ సూచనలు

తూప్రాన్: అటవీ, రెవెన్యూ భూములపై ఆర్డీఓ జయచంద్రారెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా రెవెన్యూ, అటవీ భూముల వివాదాలపై ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య ఉన్న వివాదాస్పద భూములకు వెంటనే హద్దులు నిర్ణయించి పరిష్కరించాలని సూచించారు. అవసరమైతే జాయింట్ సర్వే నిర్వహించి వివాదం లేని భూములుగా చేయాలని తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆయా మండలాల తహసీల్దార్లతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్లు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

కొమురయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

నర్సాపూర్ రూరల్: దొడ్డి కొమురయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. కార్మికులు, కర్షకులు, నిరుద్యోగ యువకులు దొడ్డి కొమురయ్యను ఆదర్శంగా తీసుకొని పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, ఆంజనేయులు, చంద్రయ్య, మల్లేశం రఘు పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



శివ్వంపేటలో పీర్ల ఊరేగింపు

పీర్ల ఊరేగింపు

శివ్వంపేట(నర్సాపూర్): మొహర్రం పర్వదినం సందర్భంగా భాగంగా గ్రామాల్లో పీర్ల పండుగ సందడి నెలకొంది. శుక్రవారం మండల కేంద్రమైన శివ్వంపేటతో పాటు గూడూర్ తదితర గ్రామాల్లో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అబ్దుల్ అజీజ్, యాసీన్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ జీపీ కార్మికులకు బీమా

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి గ్రామపంచాయతీ కార్మికులకు ఈఓ నాగభూషణం ఆధ్వర్యంలో పోస్టల్స్ ఇన్సురెన్స్ చేయించారు. ఒక్కొక్కరికి రూ.799 చెల్లించి 11 మంది సిబ్బందికి బీమా చేయించారు. రూ.799 ప్రీమియంతో రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓ నాగభూషణం కోరారు.

◆ పాటల పల్లకి కార్యక్రమం జయప్రదం చేయండి

పాపన్నపేట(మెదక్): ఈ నెల 13న మెదక్‌లోని టీఎన్జీఓ భవన్‌లో నిర్వహించే 12 గంటల పల్లకీ కార్యక్రమనాన్ని జయప్రదం చేయాలని మండల ఉద్యమ కళాకారులు కోరారు. పీసీసీ సాంస్కృతిక శాఖ అధ్యక్షుడు చక్రాల రఘు, సాంస్కృతిక శాఖ సలహాదారు నేర్నాల కిశోర్ అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

◆ శేరిపల్లి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా బాబు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా చెప్యాల బాబు, ఉపాధ్యక్షులుగా విజయ్, రవి, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా మహేందర్, కార్యదర్శిగా జశ్వంత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విజయ్ మాదిగ, మురళి, మల్లేశం, సుధాకర్, బాలాజీ పాల్గొన్నారు.

◆ కేజీవీల్స్‌తో రోడ్డుపై తిరిగితే చర్యలు

రేగోడ్(మెదక్): కేజీవీల్స్‌తో రోడ్డుపై తిరిగితే చర్యలు తప్పవని ఎస్ఐ పోచయ్య హెచ్చరించారు. కేజీవీల్స్‌ను రోడ్డుపై తిప్పడం వలన రోడ్లు పాడవుతాయని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. కేజీవీల్స్ యజమానులు తమ సూచనలు పాటించాలని కోరారు.

◆ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీఓ దామోదర్ సూచించారు. శుక్రవారం మండలంలోని మిర్జాపల్లి తండాలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కోరారు. ఇప్పటికే మిర్జాపల్లితండాలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బేస్మెంట్ బిల్లులు అందించినట్లు తెలిపారు. పనులను పూర్తి చేసిన వెంటనే బిల్లులు అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి జ్యోతి ఉన్నారు.

◆ పంట రక్షణకు బేదురు బట్ట

మునిపల్లి(అందోల్): అడవి పందుల నుంచి పంటను కాపాడు కోవడానికి రైతులు పెసర పంటలో బట్టలతో బేదురు ఏర్పాటు చేశారు. మండలంలోని పిల్లోడి, తాటిపల్లి శివార్లలోని పెసర పంటలో పంట కాపాడు కోవడానికి శుక్రవారం కొంత మంది రైతులు రక్షణ ఏర్పాటు చేశారు.

◆ గడ్డం నాగేందర్‌కు డాక్టరేట్

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని నేరడిగుంట గ్రామానికి చెందిన గడ్డం నాగేందర్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగంలో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. తెలుగుశాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు ఆధ్వర్యంలో ×తెలంగాణ ఉద్యమ చైతన్యం – పత్రికల పాత్ర* అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆయన డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. ఉద్యమ వార్తలు, వ్యాసాలు, సంపాదకీయాలు చదవడం ద్వారా ఉద్యమాన్ని అర్థం చేసుకోవడంలో పత్రికల పాత్ర ఎందో ఉందని గ్రహించి ఈ అంశాన్ని పరిశోధనకు ఎంచుకున్నట్లు చెప్పారు.

◆ విష కీటకాలతో జాగ్రత్త

నారాయణఖేడ్: వానాకాలంలో విష కీటకాలు సంచరించే అవకాశం ఉన్నందున ఇళ్ల చుట్టూ పొదలు లేకుండా చూసుకోవాలని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం కోర్టు కాలనీలో రోడ్ల పక్కన పెరిగిన పొదలను జేసీబీతో తొలగించారు. ఫ్రైడే.. డ్రైడేలో భాగంగా పాత ట్యూబులు, టైర్లు, కొబ్బరి బోండాలు, ఇతరత్ర సామగ్రిలో నిల్వ ఉన్న నీటిలో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. పలు కాలనీల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఆయా పనులను శానిటరీ అధికారి శ్రీనివాస్, వార్డు అధికారులతో కలిసి కమిషనర్ పర్యవేక్షించారు.

◆ బాసర ట్రిపుల్ ఐటీలో సీటు

మునిపల్లి(అందోల్): మండల కేంద్రమైన మునిపల్లి ఉన్నత పాఠశాలలో చదివిన హారిక బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఉపాధ్యాయులు శుక్రవారం తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హారికకు అభినందనలు తెలియజేశారు.